# ఆర్తి

- జయంతి వెంకటరమణ



మబ్బు లేని మెరుపులా ఓ రోజు ఉదయమే గడపలోకి అడుగుపెట్టాడు మాధవరావు- ముద్దుగా మాధవ్.

"మనం వెంకటాపురం వెళ్ళాలి. తొందరగా తెములు" అన్నాడు. మాధవ్ తత్త్వమే అంత. అనుకున్న పని వెంటనే అయిపోవాలి.

"వెంకటాపురమా? ఎందుకు? ఎవరున్నారక్కడ?" అడిగాను.

"చెప్తాను. మళ్ళా సాయంత్రానికల్లా వచ్చేద్దాం. తొందరగా వంట పని తెమల్చమని మీ శ్రీమతికి చెప్పు. నాలుగు ముద్దలు తిని వెళ్దాం" అన్నాడు.

"అసలు పనేమిటో చెప్పు" అడిగాను. మా అమ్మాయి తెచ్చిన కాఫీ గ్లాసు అందిస్తూ.

"వెంకటాపురం మీ ఊరికి దగ్గరేకదా. పది మైళ్ళలోపే కదా. అక్కడ రామాలయం కడుతున్నామని ఆ ఊరి పెద్దలు పెద్దలే కాదు యువకులు కూడా- వచ్చారు. ఓ అయిదు సంవత్సరాల క్రితం. చందాగా వెయ్యినూట పదహార్లు యిచ్చాను. ప్రతిష్ఠ కూడా ఆహ్వానం పంపారు. నిన్న బీరువా సర్దుతూంటే రసీదు, ఆహ్వానం రెండూ కనిపించాయి. రిటైరై ఇద్దరం ఖాళీగానే ఉన్నాం కదా. ఓసారి నిన్నూ చూచినట్టుంటుందని బయలుదేరాను. అలా వెంకటాపురం వెళ్ళి రాముడ్ని చూచినట్టుంటుంది పద. అలా వెళ్ళొద్దాం" అన్నాడు కూర్చున్నవాడు లేవబోతూ.

"దేవాలయానికి వెళ్దామన్న వాడివి. భోజనంచేసి వెళ్దామంటావేమిటి! అయినా ఈ భోజన భాజనాలన్నీ ముగిసేవేళకే పన్నెండు దాటి కోవెల కట్టేస్తారు. ఇంతకీ నీ పూజా పునస్కారాలు..."

"అన్నీ తెముల్చుకుని వచ్చేసరికి ఈవేళయింది. పద"

"పద. పద. అంటూ ఏమిటి నీ తొందర. వెంకటాపురంలో నా మిత్రుడు సీతారామయ్య ఉన్నాడు. భోజనాలు అక్కడ చేద్దాం. ముందు టిఫిన్ ఇక్కడే కానిచ్చి బయలుదేరదాం."

"ఆహా బాగుంది. భోజనం చేయకూడదట. టిఫిన్ మాత్రం చేసి దైవదర్శనానికి వెళ్ళొచ్చుట. చాలా బాగుంది."

"ఏం చేస్తాం. నీ సంగతేమో గాని నాకు మిఠాయి జబ్బు తెలిసిందా. ఏదైనా తినకపోతే నేనెక్కడైనా పడిపోతే నీకు ఇబ్బంది. అందుకని."

"నీకూ నా. నాతోనూ మా వూరి డాక్టర్‌లానే అన్నాడు. ఏం చేస్తాం. పాత అలవాట్లు పోవుగా. ఏదో, తీపి తిని తిన్నట్టు అలా కాలక్షేపం."

"అంచేత. టిఫిన్ కూడా సిద్ధంగా ఉంది. ఉప్మా పెసరట్టు- ఇవేళ టిఫిన్ మనలాంటి వాళ్ళు అప్పుడప్పుడు తినొచ్చుట. సరేనా?" అన్నాను.

"మా ఆవిడకు మాత్రం చెప్పకు సుమా" అంటూ రెండు పెసరట్లు ఎక్కువ వేయించుకుని తిన్నాడు మాధవ్. అతను తినే పద్ధతి చూస్తే ఎంతకాలం తరువాతో ఆకలి తీర్చుకున్నట్టుంది. ఏదో అడగాలనుకుని వెనుకంజ వేశాను.

మరోసారి కాఫీ తీసుకున్న తరువాత వెంకటాపురం బయలుదేరాం. వెంకటాపురం మా వూరికి పది మైళ్ళ దూరంలో ఉన్నా సరియైన బస్సు సదుపాయం లేదు. మెయిన్‌రోడ్డు మీద ఆరు మైళ్ళు ప్రయాణించి అక్కడ దిగి నాటు రోడ్డు దారిన నాలుగు మైళ్ళు వెళ్ళాలి. అదృష్టం కలిసొస్తే ఆటో దొరుకుతుంది. లేకపోతే నడవాల్సిందే. కాని మాకాఅవసరం లేదు. ఆటో దొరికింది. ఆటోలో కూర్చున్న మాధవ్ దారికిరుప్రక్కల ఉన్న పంట పొలాల్ని, రాళ్ళ గుట్టల్ని చూస్తూ ఏదో తన్మయంలో పడ్డాడు. అప్పుడు నేనే కలుగజేసుకుని అన్నాను. "ఈ వెంకటాపురంలో వెంకట్రాయుడనే ధార్మికుడున్నాడు. అతని భార్య దైవభక్తిపరురాలు. దేవుడు, పూజలు, పునస్కారాలు అంటే ఎంతో యిష్టం. ఆ సంస్కారం అలాంటిది. ఆమె ప్రేరణచేతనే ఈ రామాలయం ఉద్భవించింది. ఆలయ నిర్మాణానికి స్థలం ఇవ్వడమేకాక పోషణ భారం తానే వహించాడు. ప్రతిష్ఠ చాల వైభవంగా జరిగింది. నీవు రాలేదు అని నేను వచ్చాను. మళ్ళా ఇప్పుడే రావడం. ఆనాడు పందిళ్ళు వేసి, పానకాలు పంచి, రామకల్యాణం వైభవంగా చేశారు. వెంకట్రాయుడు మోతుబరి; వితరణ శీలి. మరి రాముడికి కొదవేముంటుంది?" అని.

మేం; వెంకటాపురం చేరేసరికి పది దాటిపోయింది. సీతారామయ్య మమ్మల్ని ఆశ్చర్యానందాలతో చూచి "ఎన్నాళ్ళకెన్నాళ్ళకు!" అంటూ స్వాగతం పలికాడు.

ఉగాది
పోటీలో
ఎంపికైన కథ

మాధవ్‌ని పరిచయం చేస్తూ వచ్చిన పని చెప్పాను.

"రామాలయం చూస్తారా? మంచిమాటే. కాని నాకు గుర్తున్నంతవరకు వెంకట్రాయుడు ఎవరి దగ్గరా చందాలు వసూలు చేయలేదే. మొత్తం ఖర్చు అంతా తానే భరించాడు. ఎవరో మిమ్మల్ని మోసం చేశారు" అన్నాడు దృఢంగా. మాధవ్ మనసు ఒక్కసారి చిన్నబోయింది.

"పోనీ! అయిందేదో అయింది. మాధవ్ రామాలయం చూస్తానని బయలుదేరాడు" అన్నాను వాతావరణం తేలిక పరచటానికి.

"రామాలయం చూస్తారా?" అడిగాడు సీతారామయ్య సాలోచనగా.

"ఏం? రామాలయంలో రాముడు కూడా లేడా?"

"లేకేం! రాముడూ ఉన్నాడు. సీతా ఉంది. కాకపోతే పూజారి గుడిలో ఉంటాడో, ఉండడో" అన్నాడు.

"ఈ ఊరి వాడివి. ప్రశ్న మమ్మల్నే వేస్తున్నావా?" అడిగాను.

"ఈ ప్రశ్న మీకు కాదు. నాలో నాకు. పదండి వెళ్దాం" అన్నాడు.

పూలు, పళ్ళు పట్టుకుని ముగ్గురం బయలుదేరాం. దారిలో అడిగాడు మాధవ్ "కోవెల ఎలా నడుస్తోంది?" అని.

"అన్ని కోవెళ్ళ లాగే" అన్నాడు.

"అంటే?" అడిగాను.

"మీరే చూస్తారుగా."

"చూస్తాం. సరే. మరి నీవు చెప్పొచ్చుగా."

"రాముడు అరణ్యవాసం చేశాడు గుర్తుందా? మా రాముడు కూడా అదే పని చేస్తున్నాడు."

నాకు కొంత అర్థమైంది. కొంత అర్థం కాలేదు. అయినా మాటాడలేదు. ఆలోచనలో పడ్డాడు.

"అదిగో గుడి" అన్నాడు సీతారామయ్య.

ఇద్దరం తలెత్తి చూశాం.

ఓ చిన్న మండపం వెనుక గుడి. చుట్టూ బయలు ప్రదేశం పిచ్చి మొక్కలతో. గుడికి సున్నం వేసి ఎన్నాళ్ళో అయినట్టుంది. నైరుతి మూలలో ఒక పర్ణ కుటీరం. ఈశాన్యంలో నేల బావి. కొద్ది దూరంలో ఒక పసువుల పాక. ఆ ప్రక్కనే.నేల బావి- ప్రక్కన- రెండు కత్రాటలు.

గుడి కటకటాల తలుపులు సగం తెరచి ఉన్నాయి. మండపంలో పన్నెండేళ్ళ కుర్రాడు- స్తంభానికి చేరగిల బడి ఏదో సన్నగా పాడుకుంటున్నాడు.

మమ్మల్ని చూచి నిలబడ్డాడు. జంధ్యం సవరించుకుని.

"శేషూ! మీ నాన్న లేరా?" అడిగాడు సీతారామయ్య.

"లేరండి" అన్నాడు వినయంగా.

"ఎక్కడికెళ్ళారు?"

"వచ్చేస్తారండి. అయితే కొద్దిగా ఆలస్యమవుతుంది. పూజ చేయించుకుంటారా? పై ఊరి నుండి వచ్చినట్టున్నారు."

"మరి మీ నాన్న లేరంటున్నావు?"

"అయితే ఏం? నేను లేనూ. నేను చేయిస్తాను" అన్నాడు నిబ్బరంగా.

"చేయిస్తావా? సరే. విగ్రహాలకు బట్టలు మార్చి ఎన్నాళ్ళయింది?" అడిగాడు మాధవ్. అతను ప్రభుత్వ ముఖ్యశాఖలో తనిఖీ అధికారిగా చాలా ఏళ్ళు పనిచేశాడు.

"వారానికి ఒకసారి మారుస్తాం. సీతమ్మవారికి మూడు చీరలున్నాయి. రామలక్ష్మణులకు రెండేసి పంచలే ఉన్నాయి. అన్నీ పాతబడిపోయాయి. అవే ఉతికి మారుస్తాం. మీరేమైనా యిస్తే ఇకనుండి అవీ కడతాము" చెప్పాల్సిందేదో చాలా చక్కగా చెప్పాడనిపించింది నాకు.

"ఉదయము, సాయంత్రము భక్తిగీతాలు, పద్యాలు మైకుపెట్టి వినిపిస్తారా? ఇక్కడ కోవెల ఉందని అందరికీ తెలియాలిగా" సలహా యిచ్చే పద్ధతిలో అడిగాడు మాధవ్.

"గుడికి కరంటు లేదు."

మాధవ్ మాటాడలేదు. నేనే అడిగాను. "ఆ ఇల్లు మీదేనా?"అని.

"మాదే. వెంకట్రాయుడుగారు బ్రతికి ఉన్నప్పుడు కట్టి యిచ్చారు. మమ్మల్ని ఎక్కడికీ కదలిపోనీకండి. చుట్టూ బయలు కదా. పాములు మా యిళ్ళలో తిరుగుతాయి. తెల్ల ఈశ్వరి వ్రేళ్ళు తెచ్చి ఉంచారు మా నాన్న. అవి వుంటే పాములు రావని. సరే మా సంగతేమి గాని. అష్టోత్తరం చేయించుకుంటారా?" అడిగాడు.

మౌనంగా తలలూపాం.

"అయితే నీళ్లు తెచ్చేవరకు వేచి ఉండండి"అంటూ ఓ సిల్వరు బిందె, నీళ్ళు తోడుకునే రేకు బాల్చీ పట్టుకుని నేల బావి దగ్గరకెళ్ళి, నీళ్లు చేది, భుజాన్న మోసుకుని వచ్చి "ముందు చేతులు కడుక్కుని, కాళ్లు కడుక్కుని, కొద్ది నీళ్ళు శిరసులపై సంప్రోక్షణ చేసుకుని రండి"అంటూ ఆజ్ఞవేసి మండపంలోకి నడిచాడు.


మేము మంత్రముగ్ధులమై అతను చెప్పినట్టు చేశాం.

తలుపులు బార్లా తెరిచాడు శేషు.

దీపపు సెమ్మెల్లో ఒత్తుల్ని పైకి ఎగదోసాడు; కొద్దిగా చమురుపోసి.

ఆ వెలుగులో రాముడు కనిపించాడు. బంతిపూదండలు తప్ప మరే అలంకారాలు లేవు. గర్భగుడిలో రెండుమూడు దేవుడి కేలండర్లున్నాయి.

మేము పూజ చేయించుకోవడంకోసం కూర్చున్నాము.



'ఎదుటివారి బాధలే నాకొస్తే'- అనే ఆలోచనే వస్తే ఒకరినొకరు బాధించరు. కష్టపెట్టరు. అలా మన గురించి, మన అల్పత్వం గురించి తెలుసుకునేది ఇక్కడే కదా. అందుకోసమే ఈ కోవెలలు... ... దీప, ధూప, నైవేద్యాలు ఇవ్వలేనప్పుడు, ఎవరూ గుడికి రానప్పుడు, గుడి గురించే పట్టించుకోనప్పుడు ఈ రాతి కట్టడాలెందుకు! దేవుడిని అవమానించి, మమ్మల్ని ఏడ్పించడమెందుకు?

"అపవిత్రోపవిత్రోవా..." అంటూ మా శిరసులపై నీళ్ళు సంప్రోక్షణ చేసి పూజకు ఉపక్రమించబోతూంటే.

"ఇందాక నీళ్ళు చల్లుకున్నాము కదా?" అడిగాడు మాధవ్.

"ఇందాక మీరు తల స్నానం చేసుకుని బాహ్యశుద్ధి అయ్యేందుకు. ఇప్పుడు అంతఃశుద్ధికోసం. అదే ఈ మంత్రం"అంటూ ధీటుగా సమాధానం చెప్పి మా గోత్ర నామాలతో, సకుటుంబ క్షేమ స్థైర్యాలు, ఆయురారోగ్య, సిరిసంపదలు కలగాలని సంకల్పం చెప్పి పూజ మొదలుపెట్టాడు. చిరిగిన వంగపండు రంగు పంచెను సర్దుకుని.

మంత్ర పుష్పం చెప్పి తీర్థం యిచ్చేంతవరకు ఏకధాటిగా పూజా కార్యక్రమం చేసి, 'అభీష్ట సిద్ధిరస్తు'అని అంటూంటే పళ్ళెంలో వంద రూపాయల నోటు వేయబోయాడు మాధవ్.

"ఈ పళ్ళెంలోవేస్తే నాకేమొస్తుంది? నూనో, ఒత్తులో, అగరొత్తులో కర్పూరమో ఏవైనా మా రాముడికోసం తెచ్చి యివ్వండి. ఒక్కొక్కప్పుడు దీపం పెట్టడానికి కూడా చమురుండదు. అప్పుడు రాముడి కళ్ళలో నీళ్ళు తిరిగినట్టనిపిస్తుంది నాకు. నాకూ ఏడుపొస్తుంది. రాముడు నవ్వితే చాలు, మాకు భోజనం కూడా అక్కరలేదు."

పది రూపాయల నోటు వెయ్యబోయే నా చెయ్యి వణికింది.

"కోవెలకీ పరిస్థితి ఎందుకొచ్చింది? వెంకట్రాయుడు గారు ఆలయ పోషకులని విన్నానే" అన్నాడు మాధవ్.

"ఇక్కడ రామాలయం వచ్చి అయిదు సంవత్సరాలయింది. వెంకట్రాయుడుగారున్న రెండు సంవత్సరాలు చాల జాగ్రత్తగా ఆలయాన్ని నిర్వహించారు. ఆయన అకస్మాత్తుగా గతించారు. భార్యకు ఏమీ తెలియదు. ఆమె అమాయకురాలు. దాయాదులు దొరికింది తీసికెళ్ళిపోయారు. అప్పులు తీర్చడంకోసం ఈ ఊళ్ళో ఉన్న ఇంటిని అమ్మేశారు. ఆమెను, ఆమె కూతురు తన దగ్గరకు తీసుకుని వెళ్ళిపోయింది. వాళ్ళెవ్వరూ లేకపోవడంతో ఈ రామాలయాన్ని చూచే వాళ్ళెవ్వరూ లేకపోయారు" వివరించి చెప్పాడు శేషు.

"మరి ఈ కోవెలకు కమిటీ ఏదీ లేదా? నిర్వహణకు!" అడిగాను.

"ఎందుకు లేదు. వాళ్ళున్నారు కాబట్టే మాకు నెలకు మూడువందల జీతమైనా అందుతోంది."

"మూడు వందలేనా?"ఆశ్చర్యపోతూ అడిగాడు సీతారామయ్య.

"ఏం? నీకు తెలీదా? ఈ ఊరి వాడివే కదా?" అడిగాను.

"ఆయన్నడిగితే ఆయనేం చెప్తారు! అంతోఇంతో అప్పుడప్పుడు ఆయన ఇస్తునే ఉంటారు. అదికాదు నేను చెప్పేది. మీరు ఇవ్వండి. మానండి. కోవెలకు రండి. వస్తూ ఉండండి. భక్తి ఉన్నవాళ్ళు భక్తిని పెంచుకోండి. పాప పుణ్యాలు తెలుసుకోండి. పాపాలు చేయకూడదని, పుణ్యాలు చేయాలని- ఇక్కడకొస్తేనే కదా ఎవరికైనా తోచేది. ఎవరమైనా ఆయన ముందు తల వంచ వలసిందేకదా. ఎంత వారైనా ఇక్కడ అంతా సమానులే కదా. భక్తిని ప్రేమగా నలుగురికి పంచండి. 'ఎదుటివారి బాధలే నాకొస్తే'- అనే ఆలోచనే వస్తే ఒకరినొకరు బాధించరు. కష్టపెట్టరు. అలా మన గురించి, మన అల్పత్వం గురించి తెలుసుకునేది ఇక్కడే కదా. అందుకోసమే ఈ కోవెలలు... ... దీప, ధూప, నైవేద్యాలు ఇవ్వలేనప్పుడు, ఎవరూ గుడికి రానప్పుడు, గుడి గురించే పట్టించుకోనప్పుడు ఈ రాతి కట్టడాలెందుకు! దేవుడిని అవమానించి, మమ్మల్ని ఏడ్పించడమెందుకు?" శేషు కళ్ళలో నీళ్ళు తిరిగాయేమో. గొంతు బొంగురు పోయింది. కొద్దిసేపాగి గొంతు సవరించుకుని "గొప్పులు తవ్వి, నీళ్ళు పోస్తేనే కదండి ఏ మొక్కైనా బ్రతికేది? దోహదాలు లేనిదే ఏ మొక్కా పూవులు పూయదు, కాయలు కాయదు". మా వయసు, అనుభవం అతని మాటల ముందు చిన్నబోయాయి.

"నీ వయసెంత?" అడిగేశాను.


"ఎందుకండి? నేనేం తప్పు మాటాడలేదుగా.

(మిగతా 12వ పేజీలో)

# పోలీస్ మ్యూజియం

మనం అనేక మ్యూజియంలు గురించి విన్నాం. కొన్నిటిని చూశాం. అయితే పోలీస్ మ్యూజియం గురించి వినలేదు గదూ?

ఆ అపురూపమైన మ్యూజియం కోల్‌కతాలో ఉంది. అది మహామహుడైన రాజారామ్ మోహన్‌రాయ్ 1814వ సంవత్సరం నుంచీ 1830వరకూ నివసించిన భవనం. ఆయన ఇంగ్లాండుకు తన నివాసాన్ని మార్చుకున్నాడు. ఆ భవంతి స్వాతంత్ర్య సంగ్రామానికి సాక్షీభూతంగా నిలిచింది. బ్రిటిష్ దుష్టపాలనను ఖండిస్తూ, వారిపై ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు సాగించిన తిరుగుబాటుకు- బ్రిటిష్‌వారి దౌర్జన్యానికి గురై, తుపాకీ గుళ్లకు బలైన యోధుల చరిత్రను అనేక గ్రంథాల్లో మనం అక్కడ చూడవచ్చును. స్వాతంత్ర్య సమరంయొక్క సంఘటనల చిత్రాలను మనం తిలకించి, నిలువెల్లా ఉద్వేగంతో విచలితులం అవుతాము. అప్పటి కలకత్తా చీఫ్ ప్రెసిడెన్సీ మేజిస్ట్రేట్ అయిన డిహెచ్.కింగ్ ఫోర్డ్‌కు కొందరు సమరయోధులు- ఒక గ్రంథంలో ఓ బాంబును పెట్టి, అతను ఒక కారులో ప్రయాణిస్తూ ఉండగా పంపారు. కొద్దిసేపటిలోనే ఆ కారు పేలిపోయి తునాతునకలు అయింది. అయితే మేజిస్ట్రేట్ చావుతప్పి కన్నులొట్టపోయిన చందంగా ఆ ప్రమాదం నుంచి బయటపడ్డాడు.



ఆనాటి సంఘటన ఫొటోలు ఆ మ్యూజియంలో ప్రదర్శించబడ్డాయి.

అచ్చట ఆనాటి చరిత్రను ప్రతిబింబించే అపురూపమైన పత్రాలు, ఫొటోలు, ఆయుధాలు, అప్పట్లో పోలీసులు ధరించిన యూనిఫామ్‌లు, టోపీలు ప్రదర్శించబడ్డాయి. కాలానుగుణంగా మారిన పోలీసు యూనిఫామ్‌లు, అప్పటి మెడల్స్, షోల్డర్ బ్యాడ్జీలు మనకు ఉత్సాహం కలిగిస్తాయి.

మ్యూజియంలో రకరకాల రివాల్వర్లు బాంబు షెల్స్‌ను మనం చూడవచ్చును. వాటిని బ్రిటిష్‌వారు, సమరయోధుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. డిసెంబర్ 23, 1912లో లార్డ్ హార్డింగ్స్ భవనంలో సమరయోధులు నాటిన బాంబు ఒకటి ఉంచబడింది.

ఈసారి మీరు కోల్‌కతా వెళ్లినప్పుడు పోలీస్ మ్యూజియంను తప్పక సందర్శించడం మరవకండి!

**- కొడిమెల**

# తైమూర్ తేయాకు

తైమూర్ ది లేమ్‌గా చరిత్రలో ప్రసిద్ధికెక్కిన టెమర్‌లేన్ ధైర్యసాహసాలు గల మంగోలు రాజు. తన సైన్యం కాచి మరిగించిన వేడి నీరును మాత్రమే త్రాగాలన్న ఉత్తర్వును జారీచేసాడు. ఈ పద్ధతిని అవలంభించడంవల్ల రోగాలు లేదా మశూచికం వంటి అంటురోగాల కారణంగా చనిపోయేవారి సంఖ్య బాగా తగ్గిపోయింది. కాచిన నీరుకు రుచి ఉండదు కాబట్టి నీటిలో తేయాకును వేసి మరిగించి మంగోలులు ఆ నీటిని త్రాగటం మొదలుపెట్టారు. ఆ విధంగా అతను గెలిచిన రాజ్యాలలో తేయాకును ప్రవేశపెట్టి ప్రపంచానికి తేయాకు వాడకాన్ని పరిచయం చేసిన వాడయ్యాడు.

# బాయ్‌కాట్ అంటే?

సాంఘికంగా, వాణిజ్యపరంగా ఒక వ్యక్తి లేదా వర్గం లేదా దేశంతో సర్వసమ్మతంగా సంబంధాలను తెంచుకోవడానికి లేదా సహాయ నిరాకరణను ఇంగ్లీషులో 'బాయ్‌కాట్' అంటారు. ఈమాట 1881నుండే ఇంగ్లీషు భాషలో వాడుకలోకి వచ్చింది. ఐర్లాండులోని జమీందారు కాప్టెన్ 'బాయ్‌కాట్' భూస్వాముల సంఘంను లెక్కచేయని కారణంగా ఈ మాట వాడుకలోకి వచ్చింది. ప్రస్తుతం అనేక చట్టసభల్లో 'బాయ్‌కాట్' అనే మాట తరచూ వినిపించడం విశేషం.

**- పి.వి.రమణకుమార్**

**(9వ పేజీ తరువాయి)**

నిత్యం రాముడ్ని చూస్తున్నాను కాబట్టి ఇన్ని మాటలంటున్నాను. ఏడవలేక పెంచలేనప్పుడు పిల్లల కనడమెందుకండి? పోషించలేనప్పుడు గుడులు కట్టడమెందుకు? రాముడంటే మా నాన్నకు ప్రాణం. తిన్నాతినకపోయినా రాముని వదలరు. నెలకు మూడువందలు యిచ్చేసరికే కమిటీవారికి నానా యాతన అవుతుంది. ఇక దీప, ధూపాలేం చూస్తారు? మేమే నాలుగిళ్ళు కుదుర్చుకుని నూనె, ఒత్తులు సంపాదిస్తాము. మరి మేము బ్రతకడమెట్లా? మా నాయన ఆ ఇంట ఈ ఇంట జరిగే పుణ్య కార్యాలకు వెళ్తారు. ఆ రోజుల్లో ఆయన గుడికి రాలేరు. ఆయన లేనప్పుడు నేను గుడిలో ఉండాలి. అందుకే నాకు ఉపనయనం చేయించి, అవసరానికని నన్నిక్కడ కూర్చోపెట్టారు. గుడే నాకు బడి అయింది. ఇంకో పదేళ్ళు పోతే మా నాయన నాకూ పెళ్లి చేస్తారు. నా కొడుకుని కూడ నేనిక్కడ నాలాగ కూర్చోపెట్టాలి. ఎందుకంటే హనుమంతుడిలా మా నాయన రాముని వదలరు."

"ఇప్పుడు నీ బాధ ఏమిటి? చదువుకోలేక పోతున్నందుకా, లేక ఈ కోవెలా?" అడిగాను.

"ఎప్పుడైనా, ఎవరికైనా, కోవెల సమస్య ఎందుకవుతుందండి? సరియైన పోషణ లేక పోబట్టి కదా, మా నాయన తిండికోసం కోవెల వదలి అవతలకు వెళ్ళవలసి వస్తోంది. ఆ అవసరమే ఆయనకు లేనప్పుడు నాకీ అవసరమూ లేదు. అందుకూ నేను బాధపడటం లేదు. నా చదువు గురించీ నాకు బాధలేదు. సీతారామయ్య మేష్టారే నన్ను ప్రైవేటుగా పరీక్షకు తయారుచేస్తున్నారు. నే చెప్పేది రాముడి గురించి. ఎలాగూ గుడి కట్టారు. నలుగురు కలిసి పోషించండి. మా పళ్ళెంలో ఒక్క రూపాయి పడినా చాలు. భక్తిని బ్రతికించండి. పెంచండి. పోషించండి. నలుగుర్ని చల్లగా చూడుమని మేము నిత్యము దేవుని ప్రార్థిస్తునే ఉన్నాము. అందరం ఆనందంగా ఉందాం. పాపాలు చేయకుండా హాయిగా బ్రతుకుదాం. గుడి మాకోసం కాదు. అందరి కోసం. అందరి బాగుకోసం.

"సర్వేజనా సుఖినోభవంతు"అంటూ భక్తితో తలవంచాడు శేషు.

నేను ఆప్యాయంగా చూశానతన్ని.

అతనిలో నాకు రాముడు కనిపించాడు.

రాముడే ఆ మాటలన్నీ అన్నాడనిపించింది నాకు.

ఈ కథకు ముక్తాయింపు ఉంది.

అయితే ఇలాంటి కథలకు ముక్తాయింపు ఇలానే ఉంటుందని, ఉండాలనీ లేదు.

కాని మాధవ్‌కోసం ఈ ముగింపు చెప్పక తప్పటం లేదు.

మీరు నమ్మకపోవచ్చు. రాముని చూచి పోదామని వచ్చిన మాధవ్, రామునితోనే వెంకటాపురంలో రాముని సేవ చేస్తూ, రామునికేలోటూ రానీకుండా ఉండిపోయాడు.

మాధవ్‌కి ఏ బందాలు లేవు.

సంవత్సరం క్రితమే భార్య గతించిపోయింది. అతనెంతో దాచాలనుకున్నా అపలేదు.

పిల్లలు- రెక్కలు వచ్చినపుడే ఎగిరిపోయారు విదేశాలకి.

ఇంటితో బంధం- రాత మూలకంగా తెంపేసుకున్నాడు.

ఉండడానికి ఇల్లు- రెండు పూటలా భోజనం- రెండూ సీతారామయ్యే ఏర్పాటుచేశాడు.

ఇక మాధవ్‌కి వెంకటాపురమే వైకుంఠం.

★